## ఉద్యోగుల గ్రీవెన్స్ డేని సద్వినియోగం చేసుకోండి

### కమిషనర్ హరిత



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 21, ప్రభాతవార్త ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా నిర్వహిం చనున్న గ్రీవెన్స్ డేని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. గురువారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ కోటేశ్వర రావు వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన ఆదేశాల మేరకు 22వ తేది శుక్రవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్‌డేను నిర్వహించను న్నామని కమిషనర్ తెలిపారు. నగరపాలక సంస్థ ఉద్యోగులు తమ సమస్యలను కమిషనర్ దృష్టికి లిఖిత పూర్వకంగా తెస్తే పరిష్కరిస్తామన్నారు. ఉద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ తెలిపారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




## ఓట్ల తొలగింపుపై పార్లమెంట్‌లో తన వాణి వినిపించిన గల్లా జయదేవ్




రేణిగుంట, డిసెంబరు 21 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ఓటర్ల జాబితాలో అక్రమాలు, దొంగ ఓట్ల వ్యవహారంపై పార్లమెంట్‌లో ఎంపీ గల్లా జయదేవ్ గళం వినిపించినట్లు ఎంపీ గల్లా జయదేవ్ కార్యాలయం నుంచి ఓ ప్రతిక ప్రకటన వెలువడింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఏ మాత్రం ఖాతరు చేయలేదని ప్రకటనలో తెలిపారు. తుది ముసాయిదా జాబితా విడుదల సందర్భంలో 13 లక్షలకుపైగా దొంగ ఓట్లు ఉన్నాయని గుర్తించినట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపినట్టు పేర్కొన్నారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించే చర్యలు చేపట్టి ప్రజాస్వామ్యాన్ని పాడాలని కోరినట్లు ప్రకటన ద్వారా తెలిపారు.

# తిరుపతి టిక్కెట్‌పై తెగని పంచాయితీ!

### -జనసేన అభ్యర్థా!? తెలుగుతమ్ముళ్ళకు అవకాశమా?



ప్రభాతవార్త-తిరుపతి:

టిడిపి అధినేత,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో తిరుపతి నియోజకవర్గంపై పట్టుకోసం తెలుగుతమ్ముళ్ళు ప్రాకులాడుతున్నారు. ఇప్పటికే రాజకీయంగా జనసేన,టిడిపి మధ్య పొత్తు కుదరడంతో రానున్న ఎన్నికల్లో తిరుపతి టిక్కెట్ జనసేనకు ఇవ్వాలని ఆ పార్టీ నేతలు బలంగా పట్టుబడుతున్నారు. ఆ దిశగా జనసేనాని అధినేత పవన్‌కల్యాణ్ కూడా చంద్రబాబుతో చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికలకు కొద్దినెలలు సమయం మాత్రమే ఉండటంతో తిరుపతి టిక్కెట్ కోసం తెలుగుతమ్ముళ్ళ లోనూ వీడని సందిగ్ధత నెలకొంది. గతంలో పిఆర్‌పి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించి,ఆ తరువాత కొంతకాలం జనసేనతో చలామణి అయిన నాయకుడు 2019 ఎన్నికల్లో టిడిపి గూటికి చేరిన ఆయన తిరుపతి టిక్కెట్ అడుగుతుండటంతో పార్టీలో లొల్లి మొదలైంది. అంతేగాక మరో వైపు తెలుగుదేశం అభ్యర్థికే తిరుపతి టిక్కెట్ ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు అల్టిమేటమ్ జారీచేస్తున్నారు. ఇప్పటికే తిరుపతిలో కొందరి వ్యవహారంతో పార్టీకి తీవ్ర నష్టం జరిగిందని, ఉన్న కార్యకర్తలను, అభిమానులను, ఓటుబ్యాంకును కాపాడుకోకుంటే పరిస్థితి చేయిదాటిపోతుందని కార్యకర్తలతో బాటు కొందరు సీనియర్ నేతలు కూడా ఒకింత ఆవేదన వెలిబుస్తున్నారు. తొలినుంచి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న వారిని కాకుండా పార్టీ మారివచ్చిన నాయకులకు పదవులు, టిక్కెట్ ఇస్తే పార్టీ పరిస్థితి మరింత ఇబ్బందులు ఎదుర్కొనడం తప్పదని లుకలుకలు మొదలయ్యాయి. తిరుపతిలో పార్టీకి ఉన్న పటిష్ట ఓటుబ్యాంకు ,అభిమానులు కాపాడుకోవాల్సిన అధిష్టానం ఇలా నాన్చుడు ధోరణితో వ్యవహరించడం చివరకు పరిణామాలు ఎక్కడకు దారితీస్తాయనేది ఆందోళన చెందుతున్నారు. బుధవారం విజయనగరం జిల్లాలో జరిగిన యువగళం సభకు తిరుపతి నుండి నలుగురు నేతలు తమతమ ఆధిపత్యం బలనిరూపణకు భారీగా అభిమానులతో కలసి వెళ్ళారు. ఇప్పటికే తిరుపతిలో పార్టీలో నాలుగువర్గాలుగా విడిపోయి నేతలు కలసి పనిచేయాల్సింది పోయి వర్గవైషమ్యాలకు కారణమవుతున్నారు.ఇప్పటికే స్థానికంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ, పార్లమెంట్ ఇన్‌ఛార్జి నరసింహయాదవ్, రాష్ట్ర కార్యదర్శులు సూరాసుధాకర్‌రెడ్డి, పుష్పావతి యాదవ్, బుల్లెట్‌రమణ, ఇనుకొండ సుబ్రమణ్యం, మబ్బుదేవనారాయణరెడ్డి,దంపూరి భాస్కర్‌యాదవ్ , బి.శ్రీధర్‌వర్మ, తెలుగుయువత,తిరుపతి నగరకమిటీ మధ్య సమన్వయం లేక ఎవరికివారే అన్నట్లు తయారైంది.వీరందరినీ ఒకేతాటిపైనడిపించాల్సిన అధిష్టానం ఇటీవల చిత్తూరుకు చెందిన న్యాయవాది సురేంద్రబాబును పరిశీలకుడుగా నియమించారు. అయినా ఇక్కడ పార్టీలో ఐక్యత కొరవడటం, సమన్వయంతో ప్రజా సమస్యలపై అధికార పార్టీపై ఢీ కొనడంలో నేతలు విఫలమయ్యారు. ఈ నేపథ్యంలో టిక్కెట్ పేరుతో పార్టీలో వర్గవిభేధాలు తలెత్తి ఓటుబ్యాంకు నష్టపోయే ప్రమాదం ప్రస్ఫుటమవుతోంది.

### రానున్న ఎన్నికల్లో

# దుష్టచతుష్టయాన్ని తరిమికొడుదాం

### - మంత్రి రోజా



నగరిలో బైక్ ర్యాలీలో మంత్రి రోజా, వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి రోజా

నగరి, డిసెంబరు 21 ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని ప్రజలు తమ జన్మదిన వేడుకల్లా జరుపుకుంటున్నారని అన్న పుట్టిన రోజు జగమంత సంబరంగా మారిందని మంత్రి రోజా అన్నారు. గురువారం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలసి వడమాలపేట మండలం అప్పలాయగుంటలో ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జగనన్న గోత్ర నామాలపై అర్చనలు, ప్రత్యేక పూజలు జరిపించామని మరో 30 ఏళ్లు అన్న ముఖ్యమంత్రిగా ఉండేలా ఆశీర్వదించాలని కోరుకున్నానన్నారు. అక్కడి నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొనగా అప్పలాయగుంట నుంచి పుత్తూరు పట్టణం మీదుగా నగరి వరకు అన్నకు జేజేలు పలుకుతూ మహానేత వైఎస్ఆర్ విగ్రహాలకు, అంబేడ్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పిస్తూర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. నేడు ప్రజలు ఎంతో సంతోషంగా తమకు అన్ని విధాలుగా అండగా నిలిచిన జగనన్న పుట్టిన రోజును జరుపుకుంటున్నారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి మాకు లేదే అన్న విధంగా ఇతర రాష్ట్రాల ప్రజలు బాధపడే విధంగా, దేశమంతా గర్వించే విధంగా జగనన్న పాలన ఉందన్నారు. అనునిత్యం విషం చిమ్ముతూ దిగజారుడు రాజకీయాలు చేసే దుష్టచతుష్టయాన్ని రానున్న ఎన్నికల్లో పటాపంచలు చేసి రాష్ట్రం నుంచి తరిమికొట్టే విధంగాచేయాలన్నారు. జగనన్న లాంటి ముఖ్యమంత్రి ఉండడం రాష్ట్ర ప్రజల అదృష్టమని, ఆయన సైనికురాలిగా పని చేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, నగరి ,పుత్తూరు మున్సిపల్ చైర్మన్‌లు నీలమేఘం, హరి, నియోజకవర్గంలోని ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, విజయలక్ష్మి, జమున, వైస్ చైర్మన్‌లు, వైస్ ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీ మండల, మున్సిపల్ కన్వీనర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అలాగే మంత్రి నివాసం వద్ద గురువారం మధ్యాహ్నం వెయ్యి మందికి అన్నదానం చేశారు. పుత్తూరు ఎస్ఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు శిక్షణ పొందడానికి రూ.2.05 లక్షల విలువగల కుట్టు మిషన్లు అందించారు. విజయపురం మండలంలో గతంలో ఇళ్లు నిర్మించుకుని పూత పని చేసుకోలేక అలాగే వదిలిపెట్టిన పేదలను గుర్తించి రూ.2.52 లక్షల విలువైన 3 వేల సిమెంటు బస్తాలను తన చారిటబుల్ ట్రస్టు నుంచి ఉచితంగా అందించారు. సత్రవాడ, కేవీపీఆర్ పేట, ఏకాంబరకుప్పం, కొత్తపేట ప్రాంతాల్లో పార్టీ నాయకులు బాలకృష్ణ, గంగాధరం, మురుగ, పురుషోత్తం, బీడీ భాస్కర్, బాబు, మోహన్‌రాజ్‌ల ద్వారా అన్నదానం, వస్త్రదానం నిర్వహించారు.

## గంగమ్మతల్లికి కుంభం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఏడు గంగమ్మల ఆలయంలో కుంభం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా, స్థానిక సంప్రదాయం మేరకు నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఏడుగంగమ్మల జాతర ముగింపు తరువాత జగన్మాత ఆదిపరాశక్తి వెలసిన ఏడుగంగమ్మల ఆలయంలో అమ్మవారి విగ్రహం వద్ద కకుంభం కార్యక్రమాలను పెళ్ళి మండపంగంగమ్మ కమిటి సభ్యులు కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.కుంభం వేసి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు.ఈ కార్యక్రమాల్లో చైర్మెన్ శ్రీనివాసులుతో పాటు గంగమ్మ కమిటి సభ్యులు పోలసామి స్వర్ణమూర్తి,షణ్ముగం, సెన్నీరు కుప్పం శేఖర్, పగడాల రాజు, మొగరాల గణేష్,కార్తీకేయన్, ప్రభాకర్, పూర్ణ, సత్యజెట్టి బాలగౌడ్, బాలరాజు, శంకర్, వెంకటముని, విజయ్, వంశీ,శ్రీనాధ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర విజయంకు కంకణం

### - జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు



చిత్తూరు, డిసెంబర్ 21 ప్రభాతవార్త:

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి కలసికట్టుగా విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జెసి పి.శ్రీనివాసులు గురువారం ఎంపిడిఓలు, తహసిల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా క్రీడా మైదానాలు, స్వాగత ఏర్పాట్లు, అవసరమైన వసతుల విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, ఎక్కడైనా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే లోగో కచ్చితంగా వుండేలా చూడాలన్నారు.

## నగర పాలక సంస్థలో సిఎం జన్మదిన సంబరాలు

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 21, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను గురువారం తిరుపతి నగరపాలన సంస్థ కార్యాలయం మేయర్ ఛాంబర్ నందు ఘనం గా నిర్వహించారు. తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి నగర మేయర్ డాక్టర్ శిరీష కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, కార్యదర్శి రాధిక, సూపరింటెండెంట్ రవి, నాగేంద్ర బాబు, మేనేజర్ చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన కళ్యాణ వేంకటేశ్వరుని ఆలయం, ఏర్పాట్లు చేసిన క్యూలైన్లు

ప్రభాతవార్త, నారాయణవనం

### భర్త హత్య కేసులో

## భార్య, ప్రియుడు అరెస్టు

తిరుపతి క్రైం, డిసెంబర్ 21, ప్రభాతవార్త

ఇటీవల చిగురువాడ వైఎస్ఆర్ కాలనీలో గోవింద్ అనే వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే.. ప్రేమికుల ఇరువురికి అడ్డుగా ఉన్న భర్త గోవిందును పథకం ప్రకారం హత్య చేసారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసామని పోలీసులు తెలిపారు. పోలీసులు విచారణలో సోంపల్లి మానస, పలాసి సింహాద్రి ఇరువురు గొంతు నులిమి హత్య చేసినట్లు తేలడంతో హత్యనేరం కేసు జతపరిచామన్నారు. మూడు సంవత్సరాల నుండి ప్రమికులుగా ఉన్న.. ఓ పక్క ప్రేమను వదులుకోలేక పెద్దలు కుదిర్చిన పెళ్లి కావడంతో దాదాపు నాలుగు నెలల పాటు కాలయపన చేస్తూ భర్తను హత్య చేసి ఆకస్మిక మరణంగా సృష్టించేందుకు ప్రయత్నం చేసారు. గోవిందు గొంతుపై గాయాలు ఉండడంతో మానస ప్రవర్తనలో పోలీసులకు అనుమానం వచ్చి తిరుపతి రూరల్ పరిధిలోని రేణిగుంట - చంద్రగిరి 150 బైపాస్ రోడ్డులో తచ్చాడుతుండగా గురువారం పోలీసులు అరెస్టు చేసారు. ఇరువురిపై హత్యా నేరం కేసు నమోదు చేసి రిమాండుకు తరలించిన్నట్లు తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో డిఎస్పి యశ్వంత్ వెల్లడంచారు.



.శ్రీకాళహస్తిలో అంగన్‌వాడీల మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

## గూడూరులో ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు



వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్ రావు

గూడూరు, డిసెంబర్ 21, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు వైకాపా ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బనిగిసాహెబ్‌పేట ప్రాంతంలో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అక్కడి నుండి ప్రాంతీయ ఆసుపత్రికి చేరుకుని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు తదితరులు ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ జన హృదయ నేత వైఎస్ జగన్ అని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే మేరిగ మురళీధర్ మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని నేత అని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమాల్లో వైకాపా నాయకులు కోడూరు మీరారెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్, సురేష్ రెడ్డి, గోపాల్ యాదవ్, జమళ్ళ వాసు, ముని, సాయి, ఇమ్రాన్, అజీజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# పుణ్యక్షేత్రంలో జగనన్న జన్మదిన పండగ సంబరాలు

### తోపుడు బండ్లు, బంకులు,గొడుగుల వితరణ



శ్రీకాళహస్తి,డిసెంబర్ 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిపుణ్యక్షేత్రంలో ముఖ్యమంత్రి జగనన్న జన్మదిన సంబరాలను స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి భారీ ఎత్తున నిర్వహించారు. జగనన్న జన్మదినం సందర్భంగా ప్రతి ఏడాది మధుసూధనరెడ్డి సామాజిక నిరుపేదలను ఆదుకునే కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 20 సంవత్సరాల నుంచి జగన్ ఛారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో గురువారం ముఖ్యమంత్రి జన్మదిన సంబ రాలను పండగలా నిర్వహించారు.

**నిరుపేదలకు సహాయ కార్యక్రమాలు:**

గురువారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 51వ జన్మదిన సంబరాలను భారీ ఎత్తున ఏర్పాటు చేసారు. నిరుపేద చిరువ్యాపారస్తులు 120మందికి తోపుడు బండ్లను అందించారు.ఇలా ఇప్పటికే సుమారు మూడు వేల మందికి పైగా తోపుడు బండ్లను అందించారు.జంగం కుల వృత్తుల వారికి ఉచితంగా శంఖం,గంటను అందించారు. నాయిబ్రాహ్మణుల కుల వృత్తుల వారికి ఉచితంగా వృత్తి పరికరాలను అందించారు. ఇక జీవనం గడుపుకొనుటకు కొందరు నిరుపేదలకు ఉచితంగా బంకులను అందించారు. టైలర్స్‌కు ఉచి తంగా మిషన్లను అందించారు.మార్కెట్లోని చిరువ్యాపారస్తులకు ఉచితంగా రోడ్ల పక్కన నీడ కల్పించుటకు గొడుగులను అందించారు.పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఓ పండగ వాతావరణాన్ని ఎంఎల్ఏ రూపొందించారు.

**ట్యాబ్స్ వితరణ:**

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా విద్యార్థులకు (8వతరగతి) ట్యాబ్స్‌ను శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి అందించారు.శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాలు సుమారు 20 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నామని నిరుపేదలు మంచి మనస్సులతో ఆశీర్వదిస్తే అదే తమకు శ్రీరామరక్ష అని వివరించారు.ప్రతి పుట్టిన రోజు ఇలాగే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమాల్లో ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం,శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, మిద్దెల హరి, జనార్ధన్‌రావు పవార్, గుమ్మడి బాలకృష్ణయ్య, లోకేష్‌యాదవ్, పగడాల రాజు, ఉన్నం వాసుదేవనాయుడు, బ్రహ్మభూషణరెడ్డి, ముత్యాల పార్థసారధి, చిట్టివేలు జయగోపాల్, కోవి చంద్రయ్యనాయుడు, పఠాన్ ఫరీద్‌ఖాన్,భరత్‌రెడ్డి వైయస్ఆర్‌సిని నాయకులు,మహిళలు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌కో నిర్లక్ష్యానికి మరో యువకుడు బలి



యాదమరి, డిసెంబర్ 21 ప్రభాతవార్త:

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం మండలంలో మరో యువకుడు బలి అయ్యాడు. మండలంలోని కీనాటంపల్లి హరిజనవాడకు సమీపంలో గురువారం సాయంత్రం 6 గంటలకు 5 అడుగుల ఎత్తులో వున్న 11కెవి వైర్లు ఓ యువకుడిని తాకడంతో విద్యుత్ ఘాతంతో యువకుడు అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. కీనాటంపల్లి హరిజనవాడకు చెందిన అభి(17) గురువారం సాయంత్రం 6 గంటలకు సమీపంలోని పొలాల్లోకి బహిర్భుమికి వెళ్ళాడు. ఆ ప్రాంతంలో 11 కెవి విద్యుత్ లైను కిందనే వుండటంతో అది ఆ యువకుడు గమనించకపోడంతో విద్యుత్ లైన్లు తగలడంతో అతనికి విద్యుత్ షాక్ కొట్టి అక్కడక్కడే కుప్పకూలిపోయాడు. ఈ ప్రాంతంలో గత ఆరు నెలలుగా 11 కెవి లైన్లు కింద వేలాడుతున్నాయి. ఈ విషయంపై పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు చెప్పినా ఇప్పుడు చేస్తాం! అప్పుడు చేస్తాం! అంటూ నాన్చుతూ వచ్చారు. 11 కెవి విద్యుత్ లైన్లను పైకి ఎత్తి కట్టడానికి ఒక నెల క్రితం ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలను సైతం తెచ్చి పెట్టారు. మళ్ళీ ఆపై పట్టించుకోకపోవడంతో 11కెవి లైను ఎప్పటిలా కింద వేలాడుతూ వుంది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం అటువైపు వెళ్ళిన యువకుడు అభి 11 కెవి విద్యుత్ వైర్లకు తన ప్రాణాలు అర్పించుకొన్నాడు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందడుగు

### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు.

చిత్తూరు, డిసెంబర్ 21 ప్రభాతవార్త:

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందడుగు వేసి భవిష్యత్తును ఉజ్వలం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. చిత్తూరు గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు 8వ తరగతి నుండి ఐఎఎస్, ఐపిఎస్, ఇంజనీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు కావాలనే లక్ష్యం నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా ముందుకు వెళ్ళాలన్నారు. పిల్లల భవిష్యత్తులో మహోన్నతమైన మార్పులు తీసుకురావడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 8వ తరగతి చదివే 18,130 విద్యార్థులు, వారికి విద్య అందించే 3,357 ఉపాధ్యాయులకు 21,487 ట్యాబ్‌లు పంపిణీ చేయడం జరగిందన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాలోని 448 పాఠశాలల్లోని 17,355 మంది విద్యార్థులకు రూ.57.27 కోట్ల రూపాయల విలువైన ట్యాబ్స్ అందించడం జరిగిందన్నారు. ప్రతి ట్యాబ్‌లోను ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథ్స్ సబ్జెక్టులతో పాటు సందేహాల నివృత్తి కోసం అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇన్స్టాల్ చేయబడిందన్నారు. అలాగే విద్యార్థులు సులభంగా విదేశీ భాష నేర్చుకోవడానికి డ్యాలింగో యాప్‌ను సైతం ఇన్‌స్టాల్ చేయడం జరిగిందన్నారు. అలాగే అవాంఛనీయ సైట్లను నిరోధించే లక్ష్యంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా దీన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఇఓ చంద్రశేఖర్, ఎంఇఓ సెల్వరాజ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

